# మాతృహృదయం

రామకృష్ణజీ

అనసూయమ్మ మనసు అశాంతిగా ఉంది

పెద్ద కొడుకు సంసారం ఎలా ఉందోనన్న ఆందోళన, వాడి దగ్గరకు పోవాలనే ఆరాటం-ఆమె హృదయంలో!

అనసూయమ్మకు ఇద్దరు కొడుకులు

పెద్దవాడు రాజారావు - విజయనగరం దగ్గర రామాపురంలో ఎలిమెంటరీ స్కూల్ టీచర్ చిన్నవాడు రమణమూర్తి - మద్రాసులో డాక్టరు

రమణమూర్తి భార్య కూడా డాక్టరే! రాజారావు భార్య చదువులేని సామాన్యురాలు

రమణమూర్తికి ఇద్దరు మగ పిల్లలు కాన్వెంట్‌లో చదువు ఆ యూనిఫాం డ్రస్‌లో ముచ్చటగా ముత్యాల్లా మెరుస్తూ ఉంటారు - పిల్లలిద్దరూ

రాజారావుకి ఇద్దరు ఆడపిల్లలు ముగ్గురు మగపిల్లలు! అందరికీ పెద్దదైన కూతురు పెళ్ళికి ఎదిగి, గుండెలపై కుంపటైతే, రెండవవాడైన కొడుకు పోలియో వ్యాధిగ్రస్తుడై పనికిరానివాడయ్యాడు మిగతా ముగ్గురు పిల్లలు ఏదో చదువు కుంటున్నారు

చాలీ చాలని జీతం తప్పిస్తే, వేరే ఆస్థి అంటూ లేని రాజారావుకు - ఎన్నో అవసరాలు ఆపైన రోగాలు, రొష్టులూతో కూడుకున్న ఆ సంసారం - మోయలేని బరువు! ఎన్నోపూటలు అర్ధాకలితోనే గడిపేస్తుంటారు ఆ కుటుంబము రాజారావులోని 'మంచితనము ఆ ఊరివారినుండి సానుభూతిని, సహాయాన్ని పుట్టిస్తుంది ఆ ఆసరాతో గతుకుల దారిలో సంసార శకటాన్ని ఎలాగో లాగుతున్నాడు రాజారావు!

అనసూయమ్మకు బ్లడ్‌ప్రెషర్ షుగర్ వంటి జబ్బులు - వాటిని తట్టుకోలేని వయసు మళ్ళిన శరీరం! బ్లడ్‌ప్రెషర్ ఎక్కువై సరియైన వైద్యంలేక కోమా వచ్చేసింది ఆమెకు పెద్ద కొడుకు యింటిలో రామాపురంలో! ఎందరు చెప్పినా తమ్ముడికి ఉత్తరం వేయడానికి నిరాకరించాడు రాజారావు! అత్తగారి స్థితి రోజు రోజుకీ కృశించిపోవడము, చావు బ్రతుకుల్లో పడడం చూసి రాజారావు భార్య కూతురితో మరిదికి ఉత్తరం వ్రాయించింది!

ఉత్తరం చూసి, హుటా హుటిన రామాపురం వచ్చాడు రమణమూర్తి పద్నాలుగేళ్ళ తర్వాత అన్న ఇంటిలో అడుగు పెట్టాడు! కొడుగ్గా, డాక్టర్‌గా తన కర్తవ్యాన్ని నిర్వహించాడు రమణమూర్తి ఇరవై రోజులకు అనసూయమ్మకు స్పృహ వచ్చింది ఆతర్వాత పది రోజులకు, వదిన ద్వారా అన్నను ఒప్పించి తల్లిని తీసుకుని మద్రాసు వచ్చేశాడు రమణమూర్తి

నెల రోజులు తన ఇంటిలో ఉన్నా, తమ్ముడితో మాట్లాడలేదు రాజారావు!

★ ★ ★ ★ ★

తండ్రి పోయినప్పటికి, రాజారావు రామాపురం ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నాడు రమణమూర్తి మెట్రిక్ చదువుతున్నాడు రామాపురం స్కూల్లోనే హెడ్‌మాష్టర్‌గా రిటైరైన తండ్రి, ఒక్క పూరి కొంపను తప్పిస్తే, మరే ఆస్థినీ కూడబెట్టలేదు మెట్రిక్ ఫస్ట్ డివిజన్‌లో పాసైన తమ్ముడిని, పెద్ద చదువులు చదివించాలని నిశ్చయించుకున్న రాజారావు, వాడిని కాలేజీలో జాయిన్ చేశాడు విజయనగరంలో కాని ఆ తర్వాత



తను పెళ్ళి చేసుకుని సంసారంలో పడ్డాక - తమ్ముడి కాలేజీ చదువు - స్కూల్ మాష్టర్ జీతంతో బరువనిపించింది! అప్పులు చేసి చదివిద్దామన్నా అప్పు లెవరిస్తారు? ఆలోచించాడు తన భార్యకు పెదనాన్నగారైన సూర్య నారాయణగారు స్థితిపరుడు పార్వతీపురంలో ఉంటున్నారు అతనికి అమ్మాయి ఉంది ఒక నిర్ణయానికి వచ్చిన రాజారావు పెద మామగారితో మాట్లాడాడు రమణమూర్తిని ఎంత ఖర్చయినా, ఏ చదువైనా సరే చదివించడానికి, వారి అమ్మాయి శారదను రమణమూర్తి చదువు పూర్తి కాగానే వివాహం చేసుకోవడానికి ఒప్పందం చేసుకున్నాడు రాజారావు పెద మామ గారితో! తత్ఫలితంగా - ఇంటర్మీడియేట్ డిస్టింక్షన్‌మార్కులతో పాసైన రమణమూర్తి - రాయవెల్లూర్ మెడికల్ కాలేజీలో ప్రవేశించాడు మూడేళ్ళ వరకు రమణమూర్తి సూర్యనారాయణ గారింటికి రాక పోకలుసాగించాడు శారద, రమణమూర్తిని కాబోయే భర్తగా ఊహించుకుంటూ ఎన్నెన్నో కలలు గనేది మెడిసన్ నాలుగో సంవత్సరంలో ఉండగా, రమణమూర్తి ఇటు రామాపురంగాని, అటు పార్వతీపురంగాని రావడం మానేశాడు ఉత్తరాలకు జవాబు కూడా వ్రాయడం మానేశాడు అనుమానం వచ్చిన సూర్య నారాయణగారు రాయవెల్లూరు వెళ్ళారు రమణమూర్తిని కలసి, పెళ్ళి విషయం అడిగారు శారదను పెళ్ళి చేసుకోడానికి రమణమూర్తి నిరాకరించాడు 'నేను మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానని వాగ్దానం చేయలేదు నాతో నే చదువుతున్న ఒక అమ్మాయిని ప్రేమించాను పెళ్ళి చేసుకోబోతున్నాను' అని నిర్మొహ మాటంగా చెప్పేశాడు ఆ మాట విన్న రాజా రావు తమ్ముడి దగ్గరకు వెళ్ళాడు అదే మాటను అన్నకూ చెప్పాడు రమణమూర్తి నచ్చచెప్పడానికి ప్రయత్నించి రాజారావు భంగపడ్డాడు అవమానంతో, అణచుకోలేని కోపంతో తమ్ముడి చెంప 'చెళ్ళు' మనిపించి వచ్చేశాడు రాజారావు అన్నట్టుగానే, రెండు నెలల్లో రమణమూర్తి నుండి 'శుభలేఖ' వచ్చింది రాజారావుకి 'ఫలానా తేదీకి లలిత అనే అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నాను అనాటికి అంతా వచ్చి ఆశీర్వదించగలరని ఆశిస్తున్నాను' – అన్న సారాంశంతో ఒక ఉత్తరము జత చేసి ఉంది దానికి

ఆ 'శుభలేఖను' చించిపారేశాడు రాజారావు

తల్లి అన్న ఎవరూ లేకుండానే రమణమూర్తి పెళ్ళి జరిగింది

ఆ రోజు రాజారావు స్కూల్‌కి వెళ్ళలేదు ఖిమ్మని ఉండిపోయాడు ఇల్లు కదలకుండా తను ఎంతో ప్రేమగా చూసుకున్న, తనను ఎప్పుడూ గౌరవించిన తమ్ముడు యిలా మారిపోతాడని, తనను తీరని అవమానానికి గురిచేస్తాడని కలలో కూడా అనుకోలేదు రాజారావు దేవుడిలాంటి అన్నను తిరస్కరించి పెళ్ళి చేసుకుంటున్న చిన్న కొడుకు తలపు ఎన్నో అగ్ని పర్వతాలను ప్రేల్చింది అనసూయమ్మ గుండెల్లో ఆ యింటిలో, ఆ రోజు వంట వండినట్లుగానే ఉండి పోయింది అగ్నిలో అర్ఘ్యంగా– ఆ మూడోరోజున మరో దుర్వార్త ఎన్నో కలలు గన్న శారద అవమానం భరించలేక నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుంది రాజారావు దహించుకు పోయాడు ఆమె చావుకు తనే కారకుడన్న భావనతో క్రుంగిపోయాడు రమణమూర్తి పరోక్షంగా హంతకుడని దుర్మార్గుడని నిర్ణయించుకున్నాడు అంతే– తమ్ముడితో రాజారావు రక్తసంబంధం లేశ మాత్రంగానైనా మిగలకుండా పోయింది

ఆ తర్వాత రెండు మూడేళ్ళలో నాలుగైదు ఉత్తరాలు వచ్చాయి రమణమూర్తి నుండి, ఒక దానిలో తను మద్రాసులో ఉంటున్నానని, ప్రవేటు క్లినిక్ నడుపుతున్నానని, తన భార్య కూడా తనతోనే డాక్టర్‌గా పని చేస్తోందని, మరోదాంట్లో తనకు కొడుకు పుట్టాడని, నామకరణం ఫలానా రోజునని అందరూ రావలసిందని– వ్రాసేవాడు అన్నింటినీ చింపి పారేశాడు రాజారావు మరోసారి వెయ్యి రూపాయల మనియార్డర్ వచ్చింది రమణమూర్తి నుండి ఆర్థికంగా సహాయ పడాలనే కోరికతో ఆ డబ్బు పంపుతున్నానని, నిరాకరించవద్దని వ్రాశాడు కాని రాజారావు ఆ డబ్బును తిరస్కరించాడు అవసరమైతే అడుక్కునైనా బ్రతుకుతాముగాని, నీవంటి విశ్వాసఘాతకుని దుర్మార్గుని, హంతకుని సహాయాన్ని స్వీకరించను నీకు తల్లి, అన్న, వదిన ఎవరూ లేరు యిక్కడ మా దృష్టిలో నీవేనాడో చచ్చిపోయావు ఇంకెప్పుడూ డబ్బు పంపకు ఉత్తరాలు వ్రాయకు' అని వ్రాసేశాడు సమాదానంగా రాజారావు

ఆ తర్వాత ఎన్నో సంవత్సరాలు దొర్లిపోయాయి

★ ★ ★ ★

రమణమూర్తి పెళ్ళి జరిగిన పన్నెండేళ్ళ తర్వాత ఆ చిన్న కొడుకు ఇంటిలో అడుగు పెట్టింది అనసూయమ్మ! కొడుకుతో సమానంగా డాక్టర్ పని చేస్తున్న చిన్న కోడలు లలితను, ముత్యాల్లాంటి మనమలు శ్యామ్ రవిలను బంగళావంటి అందమైన ఇంటిని ఆ ఇంటికి నిండుతనాన్ని మరింత అందాన్ని కలుగజేస్తున్న కారు, టి వి, ఫోను ఎయిర్ కూలర్సు సోఫాలు మొదలగు ఆదునిక హంగులను చూసింది ఆమె చిన్న కొడుకు ఉన్నతమైన స్థితిని చూసి ఆనందించిన అనసూయమ్మకు అది కళ్యాణ కాలమే నిలిచింది రామాపురంలోని పెద్ద కొడుకు ఆ పూరి కొంప ఆ పిల్లలు ఆ యాతిబాదలు మనసులో మెదిలి హృదయం మూలిగింది వీనిని చూసి ఆనందించాలో, వారిని తలచి దఃఖించాలో అర్థం కాని ఆమె నిర్లిప్తంగా ఉండిపోయింది

★ ★ ★ ★

అనసూయమ్మకు ప్రత్యేకమైన గది అందులో ఎండాకాలం వేడి తెలియనివ్వని ఎయిర్‌కూలర్ చక్కని మంచం, మెత్తని పరుపు ఆమె గురించి టేబిల్‌పై ఎన్నో మందులు, టాబ్లెట్స్ కాప్యూల్స్, లిక్విడ్స్, టానిక్స్ ఏపిల్స్, బత్తాయిలు, ద్రాక్షలు గ్లూకోజ్ వగైరాలు ఆమె అవసరాలను అన్ని వేళలా చూడటానికి ఓ పనిపిల్ల ప్రతి దినం ఉదయం లలితవచ్చి ఆరోగ్య పరీక్ష చేస్తుంది అత్తగారిని కావలసిన సూచనలు ఇస్తుంది అత్తగారికి పనిపిల్లకు కూడా ఉదయం ఫలహారం మధ్యాహ్న బోజనం ఏర్పాటులు స్వయంగా చూసి, మందులు ఇంజక్షన్లు అవసరమైతేనే యిచ్చి పనిపిల్లకు మరి కొన్ని సూచనలు యిచ్చి పదకొండు



గంటలకు క్లినిక్‌కి వెళ్తుంది లలిత ఎంతో భక్తి, గౌరవ మిళితమై ఉంటుంది ఆమె ప్రవర్తన అనసూయమ్మయెడ ఉదయాన్నే ఆరు ఏడు గంటలకు వెళ్ళిపోయే రమణమూర్తి మధ్యాహ్నము ఇంటికి వచ్చి తల్లిని పలకరించి పరామర్శించిన తర్వాత, భోజనంచేసి మళ్ళీ వెళ్ళిపోతాడు తిరిగి సాయంత్రం వస్తాడు ఒక్కో రోజు తనకు ఇష్టం లేకపోయినా బలవంతంగా కార్లో ఎక్కించి బీచ్‌కని, పార్క్‌కని, మ్యూజియమ్‌కని ఇలా ఎక్కడెక్కడో త్రిప్పుకుని వస్తాడు తల్లిని ఆమెను ఇంటిలో విడిచి, తిరిగి క్లినిక్‌కి వెళ్తాడు లలిత ఏడింటికి వస్తుంది ఆ తర్వాత రమణమూర్తి పదింటికి వస్తాడు ఇదో దినచర్య క్రమం

అనసూయమ్మ ఆరోగ్యం బాగుంది శరీరం హాయిగా ఉన్నట్లనిపిస్తోంది ఆమెకు కోడలి భక్తి ప్రపత్తులు కొడుకు అభిమానం ఆమెకు ఎంతో సంతోషాన్నిచ్చినా– హృదయాన్ని తాకే మమత, అనురాగం లోపించినట్టుగా భావన ఆమెకు రాజారావు మాటలోని మమకారం పెద్దకోడలి సపర్యలోని అభిమానం– అదో అనుభూతి

పది గంటలకు స్కూలుకు పోతూ 'టాటా నానమ్మా' అని చెయ్యూపుతూ టాక్సీ ఎక్కే మనమలు వాడిపోయిన ముఖాలతో సాయంత్రం వచ్చి పక్కలో చేరి పోతే– ఎంతో ముద్దనిపిస్తుంది అనసూయమ్మకు కాని కొడుకు పిల్లలు జ్ఞాపకం వచ్చి వారికీ వీరికీ మధ్యనున్న అంతరాన్ని తలుచుకుని ఆమె మనసు ఆదోలా అయిపోతుంది ఏదో కలగరాని బాధ కలుగుతుంది అదో అశాంతి ఆమెకు

'నానమ్మా పెదనాన్న యింటిలో టి వి ఉందా?

'అక్కడ అక్కలు, అన్నయ్యలు, తమ్ముళ్ళు

# మాతృ హృదయం

ఉన్నారా? వారెప్పుడూ రాలేదే నానమ్మా

'పెదనాన్నను మే మెప్పుడూ చూడలేదు నానమ్మా'

నువ్వు అక్కడికి మమ్మల్ని తీసుకెళతావా నాన్నమ్మా

వంటి ప్రశ్నలు ఊహ తెలియని మనమలు అడుగుతుంటే ఆమె హృదయం కెలుకుతున్నట్లనిపిస్తుంది

భగవంతుడా! నా కెందుకీ శిక్ష? నాకెందుకీ పక్షపాతం? అన్నదమ్ముల మధ్య ఈ అగాధ మేమిటి? ఒకే కడుపున పుట్టిన ఇద్దరికీ రెండు విధాల జీవిత మేమిటి? ఒకడు అదృష్టవంతుడు, మరొకడు దురదృష్టవంతుడు ఎందుకవ్వాలి? పూర్వజన్మ పాప పుణ్యాల ఫలితమా? రాజారావు గత జన్మలో పాపాలు చేశాడా? న్యాయం నీతి, మానవతల స్వరూపమైన వాడు ఈ జన్మలోనే గాదు ఏ జన్మలోనూ 'చెడు చేయలేని ఉత్తముడే! మరెందుకీ జన్మలో వాడికీ దుర్భర జీవితం! ఇలా ఆమె మనసును వేదించే ఆలోచనలకు అంతు ఉండదు భగవంతుడు న్యాయమైన వాడు కాదని ఆమెకు అనిపిస్తుంది!

*    *    *    *

మద్రాసువచ్చి రెండు నెలలు గడిచి పోయాయి రామాపురం నుండి ఉత్తరాలు లేవు వాడు వ్రాయడు అక్కడ ఎలా ఉన్నారో తెలియదు అనసూయమ్మకు పెద్ద కొడుకు దగ్గరకు వెళ్ళిపోవాలనే ఆరాటం పెరిగి పోతోంది ఇక్కడ ఈ భోగాన్ని అనుభవించలేదు తను!

సాయంత్రం కొడుకు ఇంటికి రాగానే రమణా నేను రామాపురం వెళ్ళిపోతాను అన్నది అనసూయమ్మ




రమణమూర్తి ఆశ్చర్యంగా చూశాడు

అమ్మా ఏమయింది నీకు? ఇక్కడ ఏమైనా లోపాలు జరిగాయా!

అదేంకాదు రమణా నాకు వెళ్ళి పోవాలని ఉంది

ఎందుకు నీ ఆరోగ్యము ఇపుడిప్పుడే సర్దుకుంటోంది నీకు అక్కడ వైద్య సహాయంలేదు తిరిగి పూర్వ స్థితి వచ్చేస్తుంది అయినా ఇక్కడి నుండి నిన్నెవరు తీసుకెళ్తారు రామాపురం? నువ్వు మూర్ఖంగా పట్టు పట్టకు నువ్విక్కడే ఉంటావు

ఖచ్చితంగా చెప్పేసి, తల్లి సమాధానాన్ని కూడా వినకుండా వెళ్ళిపోయాడు రమణమూర్తి

అనసూయమ్మ నిట్టూర్చింది ఆమె నిర్ణయాన్ని మాత్రం మార్చుకోలేదు

*    *    *    *

ఆదివారం మధ్యాహ్న సమయం రమణమూర్తి లలిత క్లినిక్‌కి వెళ్ళి పోయారు శలవు రోజు లయినందున శ్రీను రవి ఇంటిలోనే కేరమ్స్ ఆడుకుంటున్నారు అనసూయమ్మ ఓ నిశ్చయానికి వచ్చింది

బాబూ శ్రీనూ పిలిచింది మనవడుని

ఏం నాన్నమ్మా అంటూ వచ్చాడు శ్రీను

నీ దగ్గర డబ్బులున్నాయిగదూ

ఓ న్నాయి అన్నాడు శ్రీను

ఆమెకు తెలుసు – ప్రతి రోజూ 'సేవింగ్స్ బ్యాంక్ పెట్టిలో' వేసుకుందుకి పిల్లలిద్దరికీ డబ్బు ఇస్తాడు రమణమూర్తి

నాకు ఇస్తావా బాబూ?

ఓ అంటూ 'బాక్సు తెచ్చి, తాళం విప్పి డబ్బంతా మంచంమీద వేశాడు

అనసూయమ్మ తీసి లెక్క పెట్టింది – ఒకట్లూ రెళ్ళూ, ఐదులూ – మొత్తం నూట అరవై ఉన్నాయి!

నాకు నూరు రూపాయలు చాలు మిగతా డబ్బు పెట్టిలో వేసేస్తాను నువ్వు దాచుకో అంటూ నూరు రూపాయిలు తీసుకొని మిగతా అరవై 'బాక్స్'లో వేసేసి , వాడిచేతిలో పెట్టింది

ఎందుకు నానమ్మా నీకు డబ్బులు? అమాయకంగా అడిగాడు రవి

ఊరు వెళ్తాను మీ పెదనాన్న దగ్గరకు


మళ్ళీ వస్తావా నానమ్మా? శ్రీను, రవిలు ఒకేసారి అడిగారు ఒకవైపు నాన్నమ్మ వెళ్ళిపోతుందనే నిరుత్సాహంతో!

వస్తాను బాబూ ఎప్పుడో ఏమో రుద్ధకంఠంతో అన్నది అనసూయమ్మ, కళ్ళల్లో నీళ్ళు తిరగ్గా

ఇద్దరు మనవలను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది

పెట్టె సర్దుకుంది పనిపిల్ల బజారుకు వెళ్ళింది · అదీ మంచికే అనుకుంది అనసూయమ్మ

మనవలు వెంటరాగా రోడ్డుమీద పోతున్న టాక్సీని పిలిచి, రైల్వే స్టేషన్ వెళ్ళాలి'లని చెప్పి,




కె కె–తుని

★ మా చెల్లెలుకి చాలా దురలవాట్లు ఉన్నాయి బియ్యం తింటుంది సుద్దముక్కలు, వక్కపొడి ఎక్కువగా తింటుంది ఎంత మానుకోమని చెప్పినా వినదు మానేస్తున్నానని 3 రోజులు తినదు మళ్ళీ మొదలు

● దీనిని పైకా అని అంటారు మానసిక వ్యథ, ఇనుప ధాతువు లోపం మొదలయినవన్నీ దీనికి కారణాలవుతాయని అభిప్రాయం ఇదమిత్థంగా దీనికి కారణాలు తెలియవు సైకియాట్రిస్టుల సలహా కొంతవరకూ లాభదాయకం

పి కె–న్యూఢిల్లీ

★ మా అబ్బాయి వయస్సు 19 సం లు ఇంజనీరింగ్ చదువుతున్నాడు రెండు సం లుగా నాలుక మీద పగుళ్ళు ఏర్పడుతున్నాయి బి కాంప్లెక్సు తీసుకుంటే తగ్గుతున్నట్లుంటుంది మానేస్తే మళ్ళీ వస్తుంది మిగతా వారందరికీ రాని నోటిపూత వాడికే ఎందుకు రావాలి

● కొందరికి ఇలా జరగటం సహజం వారి శరీరంలో బి కాంప్లెక్స్ లోపం జీర్ణానికి సంబంధించిన మార్పులు సరిగా జరుగకపోవటం దీనికి కారణం అని ఒక అభిప్రాయం మానసిక ఆందోళన కూడా ఒక కారణం అంటారు ఫలానా కారణం అని ఇంతవరకు కనుగొనబడలేదు

యస్ ఎల్ - బళ్లారి

★ నేను 7 నెలల క్రితం పెద్దమనిషి అయ్యాను కానీ యిప్పుడు 3 నెలలనించి బయటలేను కారణము ఏమిటి?

● బహిస్టు రావటం ప్రారంభమయిన మొదటి కొన్ని సం లు ఇలా జరగటం చాలా సహజం దీనికి మందులు అనవసరం హార్మోనులు ఒక నిలకడకి రాకపోవటమే ఇలా జరగటానికి కారణం

జి వి కె - కర్నూలు

★ నా వయస్సు 19 సంవత్సరములు నేను తలనొప్పికి- 0 25 పవరుగల కళ్ల జోడు 1 సంవత్సరమునుండి వాడుతున్నాను కాని చదువునపుడు కళ్లజోడు పెట్టుకున్న 5 నిముషములలోనే ఆపుకోలేనంతగా నిద్ర వచ్చుచున్నది కళ్లజోడు లేకుండా చదివితే నిద్రరాదు కానీ తలనొప్పి వస్తుంది

● మీరు మీకు కళ్లజోడు రాసిచ్చిన నేత్ర వైద్యులను సంప్రదించండి మీకు ఉన్నది సైకలజికల్ పీలింగ్ అనే నా అనుమానం

డి యస్ ఆర్ - జమదాళ

★ ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకొన్నవారికి సంతానము కావాలంటే అవకాశమున్నదా? అలాంటి సదుపాయం ఎక్కడఉంది? దానివలన హానికరమా?

● రీకెనలైజేషన్ ఆపరేషన్ ద్వారా శిశువులను మరలా కనే అవకాశం ఉంటుంది పెద్ద మెడికల్ కాలేజీ ఆస్పత్రులలో సర్జన్లు ఈ ఆపరేషన్ చేసే వీలు ఉంటుంది దానివల్ల ఏమాత్రమూ హానిలేదు

ఆర్ కె యస్ ఎ - అనకాపల్లి

★ నా వయసు 26 సంవత్సరములు 13 సంవత్సరములనుండి చుట్టలు కాల్చుట అలవాటు దానివలన ముఖము పీక్కుపోయి, చెప్పి దవడలుగా తయారైనది బుగ్గలు రావలెనన్న బీరు త్రాగుటవలన ఉపయోగమున్నదా?

● ఒకదానివల్ల ఒక అవలక్షణం ఏర్పడితే మరొకదానివల్ల మరో అవలక్షణం ఎందుకు ఏర్పడదు బీరుకీ, బుగ్గలకీ సంబంధం ఏమిటి? □

ఎక్కికూర్చుంది

మనవలకు చేతు లూపుతుండగానే టాక్సీ కదిలింది!

★ ★ ★ ★

ఆరుగంటలకు ఇంటికి వచ్చిన రమణమూర్తికి తల్లి కన్పించలేదు

బాబుగారూ నేను బజారు వెళ్లొచ్చేటప్పటికి అమ్మగారు టేషన్‌కి వెళ్లినారని శ్రీనుబాబు చెప్పినాడు అని చెప్పింది పనిపిల్ల బెదురుతూ

నానమ్మ ఊరికెళ్లింది డాడీ నేనే డబ్బులు ఇచ్చాను టాక్సీలో వెళ్లిపోయింది అని చేతులూపుతూ అమాయకంగా చెప్పాడు శ్రీను

వెంటనే వెనకిల తిరిగి కారు స్టార్ట్ చేశాడు రమణమూర్తి

★ ★ ★ ★

మద్రాస్ – బొకారో ఎక్స్‌ప్రెస్ నిలబడి వుంది ప్లాట్‌ఫాంమీద రమణమూర్తి ఒక్కోపెట్టి వెదుకుతూ వెళ్తున్నాడు

ఓ బోగీలో విండో ప్రక్క సీట్లో కూర్చుని ఉన్న తల్లి కన్పించింది

అమ్మా ఆతృతగా పిలిచాడు రమణమూర్తి

# మాతృహృదయం

కొడుకుని చూసి కలవర పడలేదు అనసూయమ్మ!

ఏమిటమ్మా ఈ పని? నువ్వు ఒక్కదానివే ఎలా వెళ్ళగలవు అంతదూరం? ఇంతగా తెగించి ఎందుకు వెళ్లిపోతున్నావు? అన్నయ్య దగ్గర నీకేం సదుపాయం జరుగుతుంది? వాడితో పాటుగా నీవూ కష్టపడాలి అమ్మా బండిదిగు ఇంటికిపోదాం

గార్డు విజిల్ వేశాడు

అనసూయమ్మ దిగే ప్రయత్నం చేయలేదు గాఢంగా నిట్టూర్చింది!

రమణా తగినభార్య, చక్కని పిల్లలు అందమైన ఇల్లు కావలసినవన్నీ ఉన్న అదృష్టవంతుడివి నువ్వు నీవూ కోడలు కూడా ఇన్నాళ్లూ నన్నెంతో ప్రేమగా చూశారు ఎంతకాలమైనా మీరలానే చూడగలరని తెలుసు మీ ఇంటిలో నాకు సుఖానికి లోటులేదు కాని రమణా ఆ సుఖాన్నే నేను భరించలేకపోతున్నాను అది నా దురదృష్టము

అక్కడ నీ అన్న చాలీచాలని జీతంతో, రోగాలు రొష్టుల పిల్లలతో ఎన్నో సమస్యలు యీతి బాధలతో ఆనందానికి దూరమైన సంసారాన్ని లాక్కొస్తున్నాడు వాడి కష్టాలు ఎవరు చూస్తారు? వాడు వాడి భార్య పిల్లలు అక్కడ తినీతినక గడుపుతుంటే, నేనిక్కడ ఏపిల్ పళ్లు తినలేనురా! ఇక్కడ నీ దగ్గర సుఖంగా గడపడంకంటె అక్కడ వాడితో బాధల్ని పంచుకుని బ్రతకటమే నాకు శాంతినిస్తుంది అక్కడే నాకు మనశ్శాంతి లభిస్తుంది అందుకే వెళ్లిపోతున్నాను నీవు బాధపడకు కోడలితో చెప్పు

గార్డు పచ్చదీపం ఊపుతున్నాడు ఎక్స్‌ప్రెస్ నెమ్మదిగా కదలి సాగుతోంది

తల్లిచేతిమీద చేయివేసి, ముందుకు నడుస్తున్నాడు రమణమూర్తి అతని మనసు శూన్యమైపోయింది

చేయి తీసుకుని కొంగుతో కళ్లు తుడుచుకుంది అనసూయమ్మ ట్రైన్ వేగాన్ని పుంజుకుంది

రమణమూర్తి నిల్చుండి పోయాడు – కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి

చేయి ఊపుతున్న తల్లి మసక మసగ్గాకన్పిస్తోంది రమణమూర్తికి! □